


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 48 | శనివారం 18 జూలై, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## భారత్‌లో సరికొత్త శకం.. తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

జులై 17 వార్త సాక్ష్యం

స్వచ్ఛ ఇంధన రవాణా రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది.



## అమెరికా దాడులతో విద్యుత్ సంక్షోభం.. ప్రజలకు ఇరాన్ ప్రభుత్వం కీలక సూచన

జులై 17 వార్త సాక్ష్యం

అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, తమ దేశ విద్యుత్ మౌలిక సదుపాయాల పై దాడులు జరుగుతున్నట్లు ఇరాన్ తొలిసారిగా అంగీకరించింది. మరోవైపు, దేశంలోని దక్షిణ ప్రావిన్సులలో తీవ్రమైన వేడిగాలులు వీస్తుండటంతో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఇరాన్ విద్యుత్ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.



## గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది




జులై 17 వార్త సాక్ష్యం


గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హెల్త్ స్కీమ్


- తెలంగాణలో న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ప్రారంభం
- ఉద్యోగులు, పెన్షనర్లు సహా 17.88 లక్షల మందికి లబ్ధి
- రాష్ట్రంలోని 1000కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదురహిత వైద్యం
- డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా సేవలు..
- ఎన్ఈహెచ్ఎస్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ
- ఉద్యోగుల వాటాకు సమానంగా ప్రభుత్వ వాటా.. ప్రత్యేక ట్రస్ట్ ద్వారా నిధుల నిర్వహణ



## న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ భేష్: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు..



## శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి



-తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సతీమణి అనుముల గీతారెడ్డి
-శ్రీశైలం పుణ్యక్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం ప్రత్యేక పూజలు
-గౌరవంగా ఆహ్వానం పలికిన ఆలయ అధికారులు

## హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది



- మంగళగిరిలో రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ప్రసంగం
- 91 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని భావోద్వేగ ప్రసంగం
- అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తామని, పెట్టుబడులు ఆకర్షిస్తామని హామీ

## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్



జులై 17 వార్త సాక్ష్యం

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శనివారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, బీఆర్ఎస్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. లంచ్ మోషన్ పిటిషన్ పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సభ నిర్వహించాలని స్పష్టం చేస్తూ అనుమతించింది.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శనివారం 18 జూలై, 2026

## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్

ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ సభను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రియాంక గాంధీ ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' అమలు, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం వంటి అంశాలను ఈ సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈసభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. కోర్టులో విచారణ సందర్భంగా, ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం శాంతి భద్రతల సమస్యలు తలెత్తవచ్చని, పార్కింగ్ సౌకర్యం కూడా సరిగా లేదని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయ స్థానం, 17 రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా ఎందుకు నిర్ణయం తీసు కోలేదని అధికారులను ప్రశ్నించింది. చివరికు, రోడ్లను దిగ్బంధించడం లేదా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా సభను శాంతియుతంగా నిర్వహించాలని బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ భేష్: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న న్యాయవాదుల సంక్షేమ పథకాల వివరాలను సీజేఐ ధర్మాసనానికి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. కెనరా బ్యాంకులో రూ.100 కోట్ల శాశ్వత కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని, దీనిపై వచ్చే వడ్డీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపింది. అలాగే 2022 నుంచి 2026 వరకు న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌కు అదనంగా రూ.7 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించింది. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది న్యాయవాదుల కుటుంబాలకు ఉచిత ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించింది. ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ.2లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం అందిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. అలాగే ప్రమాదవశాత్తు న్యాయవాది మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందని, దేశంలో న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది.

## హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది...

"హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారీ నాకు అసూయ కలుగుతుంది. అక్కడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, ఐటీ టవర్లు చూసినప్పుడు కలిగే ఆ అసూయే.. నాలో కసిని పెంచింది. ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దగలమన్న నమ్మకాన్ని ఇచ్చింది" అని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శక్తిమంతమైన ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఆధునిక హంగులతో కూడిన మంగళగిరి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ సభలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన ప్రసంగంలో అభివృద్ధి, రాజకీయాలు, వ్యక్తిగత ప్రస్థానాన్ని కలగలిపి, ప్రజల్లో నూతనోత్సాహం నింపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని లోకేశ్ కొనియాడారు. "ఒకప్పుడు రైళ్లు సమయానికి వచ్చేవి కావు, బోగీలు శుభ్రంగా ఉండేవి కావు. కానీ నేడు వందే భారత్, బుల్లెట్ రైళ్లు, కవచ్ భద్రతా టెక్నాలజీ, 100 శాతం విద్యుదీకరణతో రైల్వే రంగం స్వరూపమే మారిపోయింది. దేశాభివృద్ధికి రైల్వేలే కీలకమని ప్రధాని మోదీ బలంగా విశ్వసిస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సభాముఖంగా కోరారు. అమరావతి అభివృద్ధి పై లోకేశ్ తన దార్శనికతను స్పష్టం చేశారు. "రాజధాని అమరావతికి రోడ్డు, రైలు, వాయు మార్గాల అనుసంధానం అత్యంత కీలకం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఈ మూడింటినీ అను సంధానిస్తూ ఒక ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు. 2019-24 మధ్య ఆగిపోయిన అమరావతి పనులను ఇప్పుడు చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిని ఒక గ్లోబల్ సిటీగా మార్చడమే మా అందరి లక్ష్యం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఉన్న 'డబుల్ ఇంజన్ సర్కార్'తోనే ఇది సాధ్యమని ఆయన అన్నారు. దశాబ్దాల కల అయిన విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ప్రధాని మోదీ ఆచరణలోకి తెచ్చారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మంగళగిరితో తనకున్న అనుబంధాన్ని, రాజకీయ ప్రయాణాన్ని లోకేశ్ భావోద్వేగంగా పంచుకున్నారు. "2019లో 5,300 ఓట్లతో ఓడిపోయినప్పుడు కుంగిపో లేదు. ఐదేళ్లు మీ మధ్యనే ఉన్నా, చెమటోడ్చి కష్టపడ్డా, మీ మనసు గెలుచుకున్నా. నేను ఏ మెజారిటీతో అయితే ఓడిపోయానో, దాని పక్కన ఒక సున్నా పెట్టి గెలిపించాలని కోరాను. మీరు నా మాట నిలబెట్టారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే టాప్-3 మెజారిటీతో, 91 వేల ఓట్ల ఆధిక్యంతో నన్ను గెలిపించి శాసనసభకు పంపించారు. ఈ గెలుపు నాకు కొండంత బలాన్నిచ్చింది, నాపై బాధ్యతను పెంచింది" అని అన్నారు. ఈ మెజారిటీని చూపించే కేంద్ర, రాష్ట్ర మంత్రులపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గానికి పనులు చేయిస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ కలిసి పనిచేస్తే ఒక ప్రాంతం ఎంత అద్భుతంగా అభివృద్ధి చెందుతుందో చెప్పడానికి మంగళగిరి ఒక ఉదాహరణ అని లోకేశ్ అన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేస్తూ లక్ష్మీ నరసింహ స్వామి గుడి అభివృద్ధికి, భూగర్భ డ్రైనేజీ వంటి పనులకు కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు.

# ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హెల్త్ స్కీమ్

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చిరకాలంగా నిరీక్షిస్తున్న 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' (ఎన్ఈహెచ్ఎస్) శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారిక పత్రాలతో పాటు, ఎన్ఈహెచ్ఎస్ వెబ్ పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులను వారు ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4.39 లక్షల మంది ఉద్యోగులు, 3.62 లక్షల మంది పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 17.88 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. వీరికి 114 ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు అపోలో, యశోద, కిమ్స్, కేర్, స్టార్ వంటి 886 ప్రముఖ కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదురహిత (క్యాష్‌లెస్) వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) ధరలకు అనుగుణంగా 1,816 రకాల మెడికల్, సర్జికల్ ప్యాకేజీలను ఈ పథకంలో పొందుపరిచారు. పథకం నిర్వహణ కోసం ఉద్యోగులు, పెన్షనర్లు తమ ప్రాథమిక వేతనం లేదా పెన్షన్‌లో 1.5 శాతం వాటాను విరాళంగా అందజేస్తారు. అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా తన వంతుగా జమ చేస్తుంది. నిధుల నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటిస్తూ ప్రభుత్వ, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులతో కూడిన ఒక ప్రత్యేక ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు ఎన్ఈహెచ్ఎస్ పోర్టల్ ద్వారా తమ డిజిటల్ హెల్త్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. గత ఆరోగ్య పథకంలోని లోపాలను అధిగమిస్తూ, ఉద్యోగ సంఘాల నుంచి అందిన సూచనల మేరకు ఈ సరికొత్త పథకాన్ని అత్యంత పకడ్బందీగా రూపొందించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జూలై మధ్య నాటికి ఈ నగదు రహిత సేవలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. ఈ పథకం ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం నుంచి భారీ ఊరటనిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

# భారత్‌లో సరికొత్త శకం.. తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసు కుంటుంది. కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుంది. ఈ 10 కోచ్‌ల రైలు హర్యానాలోని జింద్, సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల దూరాన్ని కేవలం రెండు గంటల్లో పూర్తి చేస్తుంది. 3,200 హార్స్‌పవర్ సామర్థ్యంతో పనిచేసే ఈ రైలు, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలిచింది. ఈ ఘనతతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్న అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది.

### రూ.12,470 కోట్లతో రహదారుల అభివృద్ధి

ఈ కార్యక్రమంతో పాటు హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసి, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.9,680 కోట్ల వ్యయంతో నిర్మించిన 158 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ వల్ల ఢిల్లీ-కత్రా ప్రయాణ సమయం 14 గంటల నుంచి 6 గంటలకు, ఢిల్లీ-అమృత్‌సర్ ప్రయాణ సమయం 8 నుంచి 4 గంటలకు తగ్గనుంది. ఇది వైష్ణోదేవి యాత్రికులకు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అదేవిధంగా అంబాలా-కాలా అంబ్, జింద్-గోహానా జాతీయ రహదారులను కూడా జాతికి అంకితం చేశారు. జింద్-గోహానా రహదారి వల్ల ప్రయాణ సమయం రెండు గంటల నుంచి 40 నిమిషాల కు తగ్గనుంది. హన్సీ-బరవాలా రహదారి విస్తరణ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

### వైద్యం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట

కురుక్షేత్ర నగరంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిర్మించిన ఎలివేటెడ్ రైల్వే ట్రాక్‌ను కూడా ప్రధాని ప్రారంభించారు. ఇది రైలు, రోడ్డు రవాణా వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచుతుంది. రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా భివానీలోని పండిట్ నేకీ రామ్ శర్మ ప్రభుత్వ వైద్య కళాశాల, నార్నౌల్‌లోని మహర్షి చ్యవన్ మెడికల్ కాలేజీ, రావు తులారామ్ ఆసుపత్రిని జాతికి అంకితం చేశారు. ఈ సంస్థల ద్వారా హర్యానాలో వైద్య విద్య, ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు సిక్కు గురువుల చరిత్ర, వారి త్యాగాలు, దేశ సంస్కృతికి వారు అందించిన సేవలను ఆధునిక టెక్నాలజీతో ప్రదర్శించేందుకు కురుక్షేత్రలో నిర్మించనున్న సిక్కు మ్యూజియానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులన్నీ హర్యానా సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

# అమెరికా దాడులతో విద్యుత్ సంక్షోభం.. ప్రజలకు ఇరాన్ ప్రభుత్వం కీలక సూచన

మరోవైపు, దేశంలోని దక్షిణ ప్రావిన్సులలో తీవ్రమైన వేడిగాలులు వీస్తుండటంతో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఇరాన్ విద్యుత్ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దాడుల తీవ్రత అధికంగా ఉన్న దక్షిణ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరాన్ ప్రభుత్వం సూచించింది. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరడం, మరోవైపు విద్యుత్ వ్యవస్థలే లక్ష్యంగా దాడులు జరుగుతుండటంతో ప్రజలు సాధ్యమైనంత వరకు విద్యుత్ ఆదా చేయాలని కోరింది. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం అమెరికా, ఇరాన్ మధ్య వివాదం ముదురుతున్న తరుణంలో, ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అమెరికా వైమానిక దాడులను కొనసాగిస్తోంది. గతంలో ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేస్తామని అమెరికా హెచ్చరించిన విషయం తెలిసిందే. తాజాగా ఇరాన్‌లోని పలు లక్ష్యాలను ఛేదించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ ఇంధన మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ దాడుల్లో విద్యుత్ ప్లాంట్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు లేదా ఇతర వ్యవస్థలు ఎంతవరకు దెబ్బతిన్నాయనే వివరాలను మాత్రం ప్రభుత్వం వెల్లడించలేదు. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న దాడుల వల్ల విద్యుత్ నెట్‌వర్క్‌లోని దాదాపు 2,000కు పైగా ప్రాంతాల్లో నష్టం వాటిల్లిందని, వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు. పాతబడిన వ్యవస్థలు, అంతర్జాతీయ ఆంక్షల కారణంగా ఆధునికీకరణకు నోచుకోకపోవడం, వేసవిలో పెరుగుతున్న డిమాండ్ వంటి కారణాలతో ఇరాన్ విద్యుత్ గ్రిడ్ ఇప్పటికే సంక్షోభంలో ఉంది. తాజా దాడులు ఈ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేశాయి. ఈ దాడుల కారణంగా ఇప్పటివరకు 38 మంది మరణించగా, 400 మందికి పైగా గాయపడ్డారని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. చబహార్ పోర్టు సమీపంలో కూడా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా అధికారికంగా విద్యుత్ కోతలు విధించనప్పటికీ, ముందుజాగ్రత్త చర్యగా దక్షిణ ప్రాంత ప్రజలు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

**శ్రీశైలం జులై 17 వార్త సాక్ష్యం**

తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి సతీమణి అనుముల గీతారెడ్డి శుక్రవారం శ్రీశైలం పుణ్యక్షేత్రంలో మల్లి కార్జునస్వామి భ్రమరాంబిక దేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమ అభివృద్ధి రైతులకు పాడిపంటల సమృద్ధి వర్షాలతో రైతుల కుటుంబాలలో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ రాష్ట్ర ప్రజల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ మర్యాదలతో అనుముల గీతారెడ్డిని శ్రీశైలం ట్రస్ట్ బోర్డు ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వ హణా ధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టిబొట్ల భరద్వాజశర్మ లు వేద పండితులతో ఆలయ మర్యాదలతో గౌరవంగా స్వాగతం పలికారు.



వార్త సాక్ష్యం
శనివారం 18 జూలై, 2026

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం

# వేగవంతమైన చర్యలు చేపట్టాలి

-ప్రతి అర్జీపై క్షేత్రస్థాయిలో విచారణ తప్పనిసరి
-వన్ మంత్--ఫోర్ విజిట్'లో వెలుగోడులో ప్రత్యేక గ్రీవెన్స్ వేదిక
-వెలుగోడు అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రల పంపిణీ
-శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

నంద్యాల, జూలై 17 వార్త సాక్ష్యం





ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని సానుకూల దృక్పథంతో పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. 'వన్ మంత్ – ఫోర్ విజిట్' కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం





నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ లు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు, సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యల కోసం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 'వన్ మంత్ – ఫోర్ విజిట్' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించదగినవైతే, మరికొన్ని చట్టపరమైన లేదా ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉంటాయనిపేర్కొన్నారు. అయినప్పటికీ ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా స్పందించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, అర్జీదారులతో స్వయంగా మాట్లాడిన అనంతరమే నివేదికలు సమర్పించాలని సూచించారు. కేవలం పైపైన పరిశీలించి సమస్య పరిష్కారమైందని నమోదు చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి ప్రధానంగా భూ సమస్యలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, నిలిచిపోయిన భవనాల పనులు పూర్తి చేయడం, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం వంటి అభివృద్ధి పనులకు సంబంధించిన అర్జీలు అధికంగా వస్తున్నాయని తెలిపారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను గ్రామ స్థాయిలోనే గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెలుగోడు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ సమ స్యలను అర్జీల రూపంలో సమర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇప్పటికే నియోజక వర్గంలోని రెండు మండలాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని, మిగిలిన మండ లాల్లో కూడా వచ్చే వారం నుంచి ప్రతి శుక్రవారం ఈ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించ ున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం వెలుగోడు మండల పరిధిలోని 20 అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం తయారు చేయడానికి అవసరమైన ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలు (యుటెన్సిల్స్)ను జిల్లా కలెక్టర్, శ్రీశైలం ఎమ్మెల్యే సంయుక్తంగా పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పోషకాహారాన్ని పరిశుభ్రంగా, సురక్షితంగా తయారు చేసేలా అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించాలని సిబ్బ ందికి సూచించారు.



### పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు

అబ్బుల్లాపురం గ్రామానికి చెందిన చింతకుంట రాముడు తనకు గతంలో ప్రభుత్వం నుండి 0.50 సెంట్ల వ్యవసాయ భూమి మంజూరు చేశారని, చుట్టుపక్కల ఉన్న భూములు ఆక్రమణకు గురవుతున్న సందర్భంగా రీసర్వే చేసి తన భూమిని తనకు ఇప్పించగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు. వెలుగోడు మండలానికి చెందిన సయ్యద్ ఖలీల్ కు బోయరేవుల గ్రామంలో సర్వే నెం.265ఎ లో 4.94 సెంట్ల భూమి చుక్కల భూమిగా నమోదు అయ్యిందని, సదరు భూమిని చుక్కల భూమి జాబితా నుండి తొలగించగలరని జిల్లా కలెక్టర్ కు అర్జీ అందజేశారు. వెలుగోడు మండలానికి చెందిన వాడం శివకృష్ణ తనకు ఎలాంటి సొంత ఇల్లు లేదని, ఇంటి స్థలం మంజూరు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు, వెలుగోడు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఈనెల 23 న జరిగే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత యువకులు సద్వినియోగం చేసుకోండి

-శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం,




ఆత్మకూరు జులై 17 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గం, ఆత్మకూరు పట్టణంలోని ఎన్టీఆర్ కేవీకే స్టేడియం , ప్రభుత్వ స్కూల్ గ్రౌండ్ నందు జూలై 23వ తేదీన జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి. శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళాకు సంబంధించి పట్టణ టిడిపి నాయకులు వేణు ,టిడిపి మండల నాయకులు రవీంద్ర, మండల కె డీ సి సి చైర్మన్ షాబుద్దీన్ మాజీ టీడీపీ మండల నాయకులు శివప్రసాద్ రెడ్డి, టీడీపీ మైనార్టీనాయకులు నాగుర్ ఖాన్ , మాజీ టీడీపీ ఎంపీటీసీ లు లింగ స్వామి, శ్రీను, టీడీపీ నాయకులు గోవర్దన్ రెడ్డి, శంకర్, దినకర్, గంగాధర్ రెడ్డి మరియు మండల టిడిపి నేతలు పాల్గొని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని చదువుకున్న యువతి యువకులు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా ఈ జాబ్ మేళాకు 10ప్రైవేట్ కంపెనీలు ఎస్ ఎస్ కె జి సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మణిపాల్ సిగ్న ప్రైవేట్ లిమిటెడ్, హ్యుందాయ్ గ్లోవిస్, యూనికోసాఫ్ట్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, మెడ్ ప్లస్, ఫోన్ పే,భారత్ ఫైనాన్స్ ఎంక్లూసన్ ప్రైవేట్ లిమిటెడ్, ఆల్ డిక్సన్ టెక్నాలజీస్ ,సుజల పైప్స్ మరియు టాటా ఎలెక్ట్రానిక్ ప్రైవేట్ లిమిటెడ్ చెందిన హెచ్ ఆర్ ప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనుటకు పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బి .టెక్ ,బి /డి /ఎం .ఫార్మసీ మరియు పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. కావున జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగము చేసుకోగలరని తెలియ జేశారు. వీటికి సంబంధించిన ఇతర వివరముల కొరకు 9951400588, 9154830286 నెంబరుకు లేదా naipunyam.ap.gov.in సంప్రదించాలని తెలియజేశారు

## శ్రీశైల అన్న ప్రసాద వితరణ కు విరాళం




శ్రీశైలం జులై 17 వార్త సాక్ష్యం

శ్రీశైలం దేవస్థానంలో అన్నదాన విరాళ కార్యక్రమానికి యానం పుదుచ్చేరికి చెందిన కుటుంబ సభ్యులు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో విల్లా దుర్గా రమేష్ కుమార్ సుజి, అన్నదాన వితరణ పథకానికి విరాళంగా రూ. 1,00,116 /-లను అందజేశారు.మొత్తాన్ని పర్యవేక్షకులు కె. శివప్రసాదుకు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందించారు.

# మిడుతూరు ఎత్తిపోతల పథకానికి సీఎం హామీ వెంటనే అమలు చేయాలి

-సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్

నందికొట్కూరు జులై 17 వార్త సాక్ష్యం







మిడుతూరు మండల ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి నిధులు విడుదల చేయాలని సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నందికొట్కూరులోని పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి రబ్బాని కాంప్లెక్స్ వరకు పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేస్తామని, ఎమ్మెల్యే, ఎం.పీ. లను గెలిపిస్తే తాను ముఖ్యమంత్రి అయిన వెంటనే నిధులు విడుదల చేస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం 2025 జూలై 17న నందికొట్కూరులో నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో కూడా రూ.60 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని చేపడతామని ప్రకటించారని తెలిపారు. మల్యాల హంద్రీనీవా కాలువ నుంచి బ్రాహ్మణకొట్టుకూరు సమీపంలో 19 కిలోమీటర్ల మేర ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి మిడుతూరు మండల రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చినా, ఏడాది గడిచినా ఎలాంటి పురోగతి కనిపించలేదని విమర్శించారు. కరవు పరిస్థితులతో మెట్ట రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే, ఎం.పీ. లు కూడా పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోయిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పథకాన్ని అమలు చేయించాలని కోరారు. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, రైతు సంఘాల సహకారంతో లిఫ్ట్ ఇరిగేషన్ సాధన కమిటీ ఏర్పాటు చేసి సంతకాల సేకరణతో పాటు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మేకల చంద్రశేఖర్, వడ్డే సుధాకర్, వేల్పుల ఏసన్న, కాటేపోగు సోమన్న, టి. నరసింహులు, ఎస్. మస్తాన్ వలి, మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఎస్. బీబీ నవ్యసాని, పి. మణికుమారి, సుబ్బమ్మ, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు

## నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలకు తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి

- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు



నందికొట్కూరు జులై 17 వార్త సాక్ష్యం

నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలకు తక్షణమే కూటమి ప్రభుత్వం కరువు సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు శుక్రవారం నందికొట్కూరు మండల పరిధిలోని అల్లూరు గ్రామంలోసిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎమ్మెల్యే జయ సూర్య కు సిపిఎం ప్రతినిధి బృందం ఎం , టి గోపాలకృష్ణ, ఎం కర్ణ, వి శ్రీనివాసులు, సంపంగి వెంకటేశ్వర్లు, ఎస్ ఉస్మాన్ భాష కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల మూలంగా ఖరీఫ్ లో వేసిన పంటలు మొక్కజొన్న, సోయాబీన్ ,పత్తి, మినుము ,కంది, పెసర, మిరప తదితర పంటలు ఎకరాకు 20వేల నుండి 50 వేల వరకు బ్యాంకుల్లో మరియు ప్రైవేటు వడ్డీలకు అప్పులు తెచ్చి రైతులు పెట్టుబడి పెట్టారని విత్తనాలకు, సేద్యపు ఖర్చులు, వ్యవసాయ కూలి ఖర్చులు పెట్టారని సకాలంలో వర్షాలు లేకపోవడం మూలంగా పంటలు ఎండిపోతున్నాయని కావున ప్రభుత్వం వెంటనే కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకునేందుకు ఎకరాకు 25 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని బ్యాంకులో అప్పులు మాఫీ చేయాలని, సాగు చేసిన కౌలు రైతులకు వర్తింపచేయాలని వారు డిమాండ్ చేశారు, మరో పక్క రెక్కల కష్టంపై ఆధారపడే వ్యవసాయ కార్మికులు వ్యవసాయ పనులు లేకపోవడం మూలంగా గ్రామాల్లో పస్తులు ఉంటున్నారు కావున ఉపాధి హామీ చట్టం వి బి జి రామ్ జి చట్టం ద్వారా కుటుంబానికి రెండు వందల రోజులు ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని వారు కోరారు, ప్రజా పంపిణీ ద్వారా 16 రకాల నిత్యవసర సరుకులు ఉచితంగా అందించాలని ఆయన డిమాండ్ చేశారు ,అందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గవర్నమెంట్ కు ప్రతిపాదనలు పంపుతామని సిపిఎం పార్టీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

## దళిత వాడలలో సమస్యలను పరిష్కరించాలి

-దళిత వాడలలో డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయాలి.



ఆత్మకూరు జులై 17 వార్త సాక్ష్యం

దళిత వాడలలో సమస్యలను పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్ లు అన్నారు. శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సామాజిక శంఖారావం కార్యక్రమం పట్టణంలోని ఎస్పీజీ పాలెం లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలంలో అధిక వర్షాలు వచ్చే సందర్భంలో పితిరి వాగు మొత్తం నిండిపోయి దళిత కాలనీలోని ఇళ్లలోకి వరద నీరు వచ్చి కాలనీ ప్రజలు విషపురుగులతో, బయట తిరగలేక ఇబ్బందులు పడుతున్నారని, పితిరి వాగు చుట్టూ సిమెంటు బెడ్డుతో రక్షణ గోడ నిర్మించాలన్నారు. అదేవిధంగా దళిత స్మశానంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దళిత కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించి అభివృద్ధికి దోహదపడాలని తెలిపారు. దళిత కాలనీలో అర్హులైన వారందరికీ 50 సంవత్సరాలకు పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు మారెన్న, సామెలు, సిఐటియు పట్టణ అధ్యక్షులు సద్దాం, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి









- ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను తక్షణమే అధికార యంత్రాంగం పనితీరు చూపాలి
- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య

నందికొట్కూరు జులై 17 వార్త సాక్ష్యం

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే అధికారులు పరిష్కరించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు శుక్రవారం పగిడ్యాల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన (గ్రీవెన్స్–డే) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మండల నలు మూలల నుంచి తరలి వచ్చిన ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించి, న్యాయ పరంగా ఉన్న సమస్యలను అక్కడిక్కడే అధికా రులతో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. మిగిలిన ఆయా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించేందుకు వివిధ శాఖల అధికా రులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ సీఎంఆర్ఎఫ్ ద్వారా పగిడ్యాల గ్రామానికి చెందిన, నల్లమల్ల నాగరాజు కు రూ. 1,19,999/– మంజూరైన చెక్కును కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేయడం జరి గింది. అనంతరం విభిన్న ప్రతిభా వంతుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభా వంతురాలైన యశోదకి ఉచితంగా మంజూ=ౖన రెట్రోఫిట్టెడ్ మూడు చక్రాల స్కూటర్ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో: మండల తాసిల్దార్ శివ రాముడు మండల అభివృద్ధి అధికారి మరియు వివిధ శాఖల , ప్రభుత్వ అధికారులు, టిడిపి నాయకులు కార్యకర్తలు గ్రామీణ ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు,సీనియర్ నాయకుల నాయకత్వమే కీలకం





- సర్ ఓటర్ జాబితా ప్రక్రియలో నాయకుల పర్యవేక్షణం ఉండాలి
- ఒక్క ఓటు తొలగించకుండా ఓటర్లకు న్యాయం చేయాలి
- ఓటర్ల జాబితాలో తప్పు ఒప్పులను సరిచూసే విధంగా పార్టీ కోసం పనిచేయాలి
- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య

నందికొట్కూరు జులై 17 వార్త సాక్ష్యం

పగిడ్యాల కేంద్రంలో టిడిపి పార్టీ సీనియర్ నాయకులు మండల కన్వీనర్ పల్నని మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం లో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు ముందుగా పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యేను మర్యాద పూర్వ కంగా ఆహ్వానం పలికారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు యొక్క సమస్యలను, పలు అంశాలు గూర్చి చర్చించ డం జరిగింది. నాయకులు కార్యకర్తలు సమన్వయం గా ఉండాలని, నేను కార్యకర్తతో సమాన మని తెలి యజేశారు. మనలో మన కి విభేదాలు లేకుండా త్వరలోనే జరిగే లోకల్ బాడీ స్థానిక ఎన్నిక ల్లో ఎంఎ టీసీ, జెడ్పీటీసీ గ్రామ పంచాయతీలను కష్టపడి గ్రామాలలో గెలిపించాల్సిందిగా తెలపడం జరిగింది. పని చేసిన కార్యకర్తలను, నాయకులను సర్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం పగిడ్యాల మండలం 100% పూర్తి చేయాలని పేర్కొన్నారు కష్ట పడిన కార్యకర్తకి తప్పకుండా గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి, దామో దర్ రెడ్డి, లోకానంద్ రెడ్డి, వాసిరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, గంగన్న, చంద్రేష్, మద్దిలేటి గౌడ్, షమీన్ భాష, పాత కోట వెంకటరెడ్డి, రమణ, విజయ్, ఓ శ్రీనివాసులు, సిరి గౌడు, హుస్సేన్ సాహెబ్, క్లస్టర్ ఇంచార్జిలు, బూత్ ఇన్చార్జిల, గ్రామ వార్డు ఇన్చార్జిలు యూనిట్ ఇన్చార్జిలు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి






నంద్యాల జులై 17 వార్త సాక్ష్యం

ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అమరావతిలోని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్యాంప్ కార్యాలయంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరితో పాటు టీడీపీకి చెందిన ఎంపీలందరూ పాల్గొన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రయోజనాల సాధనే లక్ష్యంగా ఉభయ సభల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల సాధనకై చేయాల్సిన పోరాటంపై ఎంపీలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ

అమరావతి జులై 17 వార్త సాక్ష్యం

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తమ నివాసానికి వచ్చిన నిర్మలా సీతారామన్‌కు సీఎం సాదరన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.





# సార్వత్రిక ఎన్నికల ఫార్ములా స్థానిక సంస్థల ఎన్నికల్లో వర్తించదు

**-2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం కోసం నాలుగు అడుగులు వెనక్కి తగ్గాం**
**-కార్యకర్తల ఆవేదన, ఆకాంక్షలు అర్థం చేసుకున్నాం**
**-క్షేత్రస్థాయిలో బలాబలాలను బేరీజు వేసుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం**
**-ఎన్డీఏ గెలుపే ధ్యేయంగా సమాయత్తమవుతాం**
**-సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపికపై కూటమి పార్టీలు కూర్చుని చర్చించుకుంటాయి**
**-జిల్లా, పార్లమెంట్ పరిధిలో సమన్వయ కమిటీలు**
**-తెనాలి మీడియా సమావేశంలో జనసేన పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

అమరావతి జులై 17 వార్త సాక్ష్యం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయమే లక్ష్యంగా జనసేన పార్టీ సమాయత్తమవుతోందని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో జనసేన తప్పకుండా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటం సభలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేసిన ప్రకటనకు కట్టుబడి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుపును దృష్టిలో ఉంచుకుని త్యాగాలు చేశామని, అదే ఫార్ములా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వర్తిస్తుందనుకోవడం పొరపాటని తెలిపారు. శుక్రవారం తెనాలి నియోజకవర్గం చెంచుపేటలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... "జనసేన పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో కచ్చితంగా పోటీ చేస్తుంది. నాయకులు, జన సైనికులు, వీరమహిళలకు తగిన అవకాశాలు కల్పించేలా పార్టీ కార్యాచరణ ఉంటుంది. అదే సమయంలో కూటమి భాగస్వామ్యాన్ని గౌరవిస్తూ అన్ని పార్టీలతో సమన్వయం కొనసాగిస్తాం. ప్రజల మేలు కోసం ఎన్డీఏ కూటమిని బలోపేతం చేసేందుకు 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో నాలుగు అడుగులు వెనక్కి తగ్గాం. అప్పట్లో తీసుకున్న నిర్ణయాలను ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికలతో ముడిపెడుతూ వచ్చిన వార్తలు సరికావు. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు, వీరమహిళల అభిప్రాయాలు, ఆకాంక్షలు, ఆవేదనలను పార్టీ నాయకత్వం పూర్తిగా అర్థం చేసుకుంది. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతాం.





**కూటమి సమన్వయం కోసం కమిటీలు**

రెండు రోజుల క్రితమే ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల సమన్వయ సమావేశం జరిగింది. కూటమిలో ఎక్కడైనా చిన్నచిన్న లోపాలు, సమన్వయ లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకోవాలని నిర్ణయించుకున్నాం. పార్టీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసే దిశగా యువత, మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పించడంతో పాటు, క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమించిన కార్యకర్తలకు భరోసా కల్పించే విధంగా మూడు పార్టీలూ సమన్వయంతో పనిచేస్తాయి. ఇది భాగస్వామ్య పార్టీల ఉమ్మడి బాధ్యత. అదే విధంగా ప్రతి జిల్లాలో సమన్వయం మరింత సమర్థవంతంగా ఉండేందుకు పార్లమెంట్, జిల్లా పరిధిలో ప్రత్యేక సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం. అభ్యర్థుల ఎంపిక, సీట్ల కేటాయింపు వంటి అంశాలపై భాగస్వామ్య పార్టీల మధ్య పరస్పర చర్చల ద్వారా నిర్ణయాలు తీసుకుంటాయ"న్నారు

# షెడ్లలో కాదు.. విధుల్లోనే ప్రతి వాహనం



గుంటూరు వార్త సాక్ష్యం

నగర పారిశుధ్య వ్యవస్థలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా ప్రతి వాహనం ప్రజల సేవలోనే ఉండాలని గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ స్పష్టం చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంలో చెత్త సేకరణ, తరలింపు వాహనాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ, పనికొచ్చే ఏ వాహనం కూడా వెహికిల్ షెడ్‌లో నిలిపివేయరాదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కెవీపీ కాలనీలోని నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్‌ను శుక్రవారం పరిశీలించిన కమిషనర్, పారిశుధ్య విభాగంలో వినియోగిస్తున్న వాహనాల పనితీరు, నిర్వహణ, క్షేత్రస్థాయి వినియోగంపై సమగ్రంగా సమీక్షించారు. ప్రజల నుంచి చెత్త సేకరణ, నగరంలోని ప్రధాన రహదారులు, కాలనీల పరిశుభ్రతలో ఎక్కడా అంతరాయం లేకుండా అన్ని వాహనాలు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన స్వీపింగ్ యంత్రాలు, స్క్రాప్ పికింగ్ మెషిన్లు, ఎలక్ట్రిక్ డోర్-టు-డోర్ చెత్త సేకరణ వాహనాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. మరమ్మతుల కారణంగా నిలిచిపోయిన వాహనాలను వెంటనే రిపేర్ చేసి తిరిగి సేవల్లోకి తీసుకురావాలని, వినియోగానికి పనికిరాని పాత వాహనాలను వేలం ద్వారా తొలగించి నిర్వహణ వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. గుంటూరులోకి ప్రవేశించిన ప్రతి ఒక్కరికీ పరిశుభ్రమైన, స్వచ్ఛమైన నగరం కనిపించేలా పారిశుధ్య వ్యవస్థ పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. చెత్త పేరుకుపోవడం, వాహనాల కొరత వంటి సమస్యలకు ఆస్కారం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అదే సమయంలో నగర పారిశుద్ధ్యాన్ని మరింత బలోపేతం చేసేలా గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## పాఠశాలలో బోర్‌కు భూమిపూజ

రెంటచింతల వార్త సాక్ష్యర్

రెంటచింతల మండలంలోని రెంటాల గ్రామ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. పాఠశాలలో బోర్‌వెల్ ఏర్పాటు కోసం శుక్రవారం టీడీపీ నేత, సొసైటీ డైరెక్టర్ ఛేర్రెడ్డి రాజ్యలక్ష్మీ భూమిపూజ నిర్వహించారు. కూటమి నాయకుల విజ్ఞప్తికి ప్రభుత్వం స్పందించి సుమారు రూ. 1.25 లక్షల వ్యయంతో బోర్‌వెల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీంతో విద్యార్థుల దాహార్తి తీరనుండటంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఛేర్రెడ్డి రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, త్వరలో 'తల్లికి వందనం' పథకం నిధులను కూడా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇగుటూరు రాజశేఖరరెడ్డి, ఛేర్రెడ్డి ప్రదీప్‌రెడ్డి, టీడీపీ సీనియర్ బీసీ నాయకుడు బి. గాలయ్య, సాగర్, నరేష్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అత్తగారింట్లో చోరీ...అల్లుడు అరెస్ట్

**అత్తగారింట్లో బంగారం చోరీ చేసిన అల్లుడు అరెస్ట్**
**సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో కేసు ఛేదించిన పోలీసులు**
**రూ.7 లక్షల బంగారం స్వాధీనం.. పోలీసు బృందానికి డీఎస్పీ ప్రశంసలు**

తెనాలి వార్త సాక్ష్యం

తెనాలి రూరల్ పరిధిలో కుటుంబ కలహాల నేపథ్యంలో అత్తగారింట్లో చోరీకి పాల్పడిన యువకుడిని పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల సహాయంతో అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.7 లక్షల విలువైన 70 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని కేసును వేగంగా ఛేదించారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో అత్తగారింట్లో తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన యువకుడిని తెనాలి రూరల్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో అరెస్టు చేసి కేసును ఛేదించారు. నిందితుడి నుంచి సుమారు రూ.7 లక్షల విలువైన 70 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి రూరల్ సీఐ నాయబ్ రసూల్ వెల్లడించారు. కొల్లూరు మండలం దోనేపూడికి చెందిన అయ్యంకి పసి కుటుంబ విభేదాల కారణంగా అత్తగారింట్లో చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. కేసు నమోదు చేసిన వెంటనే సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సమాచారాన్ని విశ్లేషించి నిందితుడి కదలికలను




గుర్తించిన పోలీసులు నందివేలుగు జంక్షన్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఈజీ మనీ కోసం నేరాలకు పాల్పడుతున్న వారి కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని చెప్పారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో నేరాలను వేగంగా ఛేదిస్తున్నామని తెలిపారు. చోరీలు, ఇతర ఆస్తి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, ఎవరూ చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన సీఐ నాయబ్ రసూల్, ఎస్ఐ ఆనంద్‌తో పాటు దర్యాప్తు బృందం పనితీరును డీఎస్పీ జనార్ధన్‌రావు అభినందించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా నేరాల నియంత్రణకు పోలీసులు మరింత అప్రమత్తంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

# రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి..

**-కలెక్టర్ వినోద్ కుమార్**

నిజాంపట్నం వార్త సాక్ష్యం

రైతుల భూ సమస్యలను కార్యాలయాల్లో కూర్చొని కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులను తెలుసుకుని బాధ్యతాయుతంగా పరిష్కరించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి., ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. రీ-సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. శుక్రవారం రేపల్లె ఆర్డీఓ బి. శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి ఆముదాలపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 111 భూమిని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. సంబంధిత రైతులతో మాట్లాడి భూ సమస్యలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భూముల సరిహద్దులు, రికార్డులు, రీ-సర్వే వివరాలను నిశితంగా పరిశీలించిన ఆయన, వాస్తవ పరిస్థితులను నమోదు చేసి నిబంధనల ప్రకారం రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వీఆర్వోను ఆదేశించారు. రైతుల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజల్లో నమ్మకం పెంచేలా ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. అనంతరం ఆముదాలపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ, సేవల అమలును పరిశీలించారు. సమస్యలతో వచ్చే ప్రజలను మర్యాదగా పలకరించి, వారి వినతులను శ్రద్ధగా విని, పరిష్కారంపై స్పష్టమైన సమాచారం అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.



# కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రివ్యూ మీటింగ్

జులై 17 వార్త సాక్ష్యం:

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రివ్యూ మీటింగ్ లో కలెక్టర్ హరిత ఎస్పీ నితిక పంత్,ఎమ్మెల్యే కోవా లక్ష్మి,జిల్లా ఉన్నతధికారులు, తెలంగాణ రాష్ట్ర ఎస్ సి ఎస్ టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,ఎస్ సి ఎస్ టి కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్,కురుసం నీలాదేవి, రాంబాబు నాయక్ పాల్గొని ఎస్ సి ఎస్ టి కి సంబందించిన సమస్యల పైన సంపూర్ణంగా చర్చించడం జరిగింది.ఇటీవల దళిత మహిళను విచక్షణ రహితంగా కొట్టిన కూడా స్పందించని పోలీస్ అధికారులపై సీరియస్ అయిన కమిషన్.వెంటనే వారిపై చర్య తీసుకోని అట్రాసిటీ,అటెమ్ట్ మర్డర్ కేసు నమోదు చేయాలనీ ఆదేశించిన కమిషన్.అలాగే అట్రాసిటీ కేసులకు అలాగే పరిహారల పెండింగ్ విషయంలతో పాటు మంజూరైనా వాటిని



అందించడానికి ప్రభ్యుత్వానికి నివేదిక పంపాలని కలెక్టర్ ని కోరడం జరిగింది.అలాగే అట్రాసిటీ కేసుల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని SP ని కోరడం జరిగింది.అలాగే ఎస్ సి ఎస్ టి వాళ్లకు సంబంధించినా రిజర్వేషన్ కు అనుకూలంగా అవుట్ సోర్సింగ్ లో కూడా వారికి అవకాశాలు కల్పించాలని అలాగే మున్సిపాలిటీ లో పని చేస్తున్న 60 సం"నిండిన కార్మికుల కుటుంబంలోని వారికి ఉద్యోగ అవకాశం కల్పిస్తూ పిఎఫ్,ఈఎస్ ఐ సౌకర్యం కల్పించాలి. రిజర్వ్ ఫారెస్ట్ కు సంబందించిన పట్టాలా పైన డి ఎఫ్ ఓ కి ఇందిరమ్మ ఇల్లు,రోడ్లు, అంగనివాడి



స్కూల్స్ కట్టుకోవడానికికై అర్జీ పెట్టుకుంటే పర్మిషన్ ఇవ్వాలని ఆదేశించిన కమిషన్,షోషల్ వెల్ఫేర్ స్కూల్ లల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలనీ కలెక్టర్ ని కోరిన కమిషన్.విద్య,వైద్యం పైన కూడా చర్చించిన తెలంగాణ రాష్ట్ర ఎస్ సి ఎస్ టి కమిషన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో అపరిశుభ్రతపై కలెక్టర్ అసంతృప్తి

-పారిశుధ్య కాంట్రాక్టు ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశం

జులై 17 వార్త సాక్ష్యం

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలోని అవుట్ పేషంట్ బ్లాక్, కాన్పుల విభాగం, ఇమ్యూనైజేషన్ గది, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్ తదితర విభాగాలను సందర్శించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణను, శిథిలావస్థకు చేరిన ఐసోలేషన్ వార్డు భవనాన్ని పరిశీలన జరిపారు. ఆసుపత్రి ఆవరణ, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య కాంట్రాక్టు ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. పరిస్థితిలో మార్పు రాకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డితో కలిసి బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇతర వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి రికార్డులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు స్టేట్ మెంట్లను



నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రిలో నెలకొని ఉన్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. బాన్సువాడ తో పాటు సరిహద్దు ప్రాంతాల నుండి గర్భిణీలు ఈ ఆసుపత్రిని సందర్శిస్తున్నారని, ప్రతి నెల సగటున 200 వరకు కాన్పులు జరుగుతున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆసుపత్రిలో బర్త్ వెయిటింగ్ రూం ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మెడికో లీగల్ కేసులు కూడా ఎక్కువగానే వస్తున్నందున, భద్రతాపరమైన అంశాల రీత్యా బోధన్ ఆసుపత్రిలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా పోలీసు శాఖకు ప్రతిపాదిస్తామని తెలిపారు. వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై నమ్మకాన్ని పెంపొందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ హితవు పలికారు. వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రోగులకు నాణ్యమైన సేవలు అందించేలా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అవసరమైన మౌలిక సదుపాయాలను, వైద్యులను, సిబ్బందిని సమకూరుస్తామని, అయినా కూడా వైద్య సేవలలో లోపాలు ఉంటే ఎంతమాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు జరుపుతానని, నిర్లక్ష్యానికి తావు కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు. స్థానిక ఆర్డీఓ నేతృత్వంలో ప్రతి పక్షం రోజులకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహించి, ఆసుపత్రి నిర్వహణ తీరుతెన్నులపై తనకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్, స్థానిక వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ఎస్.సి.,ఎస్.టి. ల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

-రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి.కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

జులై 17 వార్త సాక్ష్యం

జిల్లాలో షెడ్యూల్డ్ కులములు,షెడ్యూల్డ్ తెగలకు చెందిన ప్రజల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని రాష్ట్ర ఎస్.సి.,ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు,బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్,కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్,కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ,జిల్ల శంకర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి ఎస్.సి.,ఎస్.టి.లకు సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఆశ్రమ పాఠశాల లు, ఆర్.ఓ.ఎఫ్.ఆర్.చట్టం,ఎస్.సి.,ఎస్.టి. గ్రామాల లో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ... షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్ తెగలవారికి రాజ్యాంగం కల్పించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తూ వారి సంక్షేమ,అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో 56 వేల 969 మంది షెడ్యూల్డ్ తెగలు,1 లక్ష 99 వేల 493 మంది షెడ్యూల్డ్ కులముల వారు ఉన్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం సంక్షేమ పథకాలు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, దుప్పట్లు, బంకర్ బెడ్స్ సమకూర్చడం జరుగుతుందని, వసతి గృహాలు, గురుకులాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం



పోషక విలువలతో కూడిన భోజనం అందించడం జరుగుతుందని, సి.సి. కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్.సి.,ఎస్.టి.సబ్ ప్లాన్ క్రింద నిధుల కేటాయింపు జరుగుతుందని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డ్ కలిగిన ప్రతి ఎస్.సి., ఎస్.టి. లకు పని కల్పించడం జరుగుతుం దని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి.స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 20 లక్షల రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, అంగన్వాడి, గ్రామ పంచాయతీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు.మంచిర్యాల జిల్లాలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు, పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను సమర్ధ వంతంగా నిర్వహించడం అభినందనీయ మని, త ద్వారా కేసులు తగ్గుముఖం పట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. 1 వేయి కంటే ఎక్కువగా కేసులు నమోదు అయిన జిల్లాలలో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుకు ప్రతిపాదించడం జరిగిందని, మంచిర్యాల జిల్లాలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసు కుంటామని తెలిపారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్.చట్టం ప్రకారం గ్రామాలలో సభలు నిర్వహించి అర్హులైన గిరిజనులు,గిరిజనేతరులకు నిబంధనలకు లోబడి పట్టాలు జారీ చేసే విధంగా రెవెన్యూ, అటవీ,పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సర్వే చేయాలని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ,ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతిలో రోస్టర్ పద్ధతిని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో బెల్ట్ షాపులపై ఆబ్కారీ మద్య నిషేధ శాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు.మున్సిపాలిటీలలో ఎస్.సి.,ఎస్.టి. పొరుగు సేవల ఉద్యోగులు,సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని,పి.ఎఫ్. అమలు, భీమా సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు,తెగల ప్రజలు నివసిస్తున్న గ్రామాలకు రహదారి సౌకర్యం ,త్రాగునీటిని అందించాలని,అట్రాసిటీ కేసులను త్వరగా విచారించి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని, అట్రాసిటీ బాధితులకు త్వరగా పరిహారం అందించాలని తెలిపారు. జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలలో షెడ్యూల్డ్ కులములు ,షెడ్యూల్డ్ తెగలను ప్రోత్సహించాలని, ఉపాధి కల్పనలో ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో ఎస్.సి.,ఎస్.టి.విద్యార్థుల ప్రవేశాల దృష్ట్యా పాఠశాలలకు చెల్లించవలసిన బకాయిలు, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు, విదేశీ విద్య ఉపకార వేతనాలు,ఇతర రంగాలకు సంబంధించిన అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... షెడ్యూల్డ్ తెగలు, కులముల వారి అభివృద్ధి,సంక్షేమానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించడం జరుగుతుందని,అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి.,ఎస్.టి. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు,దుర్గ మల్లయ్య,పెద్ది రాజన్న, పౌర సరఫరాల కమిటీ సభ్యులు జిల్లపల్లి వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ ఇచ్చేవరకు పోరాటం ఆగదు

-ఇందూరు రణభేరిలో ఎంపీ అరవింద్-




జులై 17 వార్త సాక్ష్యం

రాష్ట్రంలో కమీషన్ ల సర్కారు కొనసాగుతుందని, ప్రతి పనిలో పర్సంటేజీలు తీసుకుంటున్నారని నిజామాబాద్ ఎంపీ అరవింద్ ఆరోపించారు. ఫీజు రియంబర్స్మెంట్ విడుదలకై బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ధర్నాచౌక్ లో ఇందూరు రణభేరి నిర్వహించారు.ఈ నిరసన కు నిజామాబాద్ ఎంపీ అరవింద్ , ఎమ్మెల్యే లు దన్ పాల్ సూర్యనారాయణ,పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ శ్రేణులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.అమలు కానీ అమిలిచ్చీ అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలతో చెలగాటం అందుతుందని పేర్కొన్నారు.ఫీ రియంబర్స్మెంట్ అందక విద్యార్థులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఈ ఉందన్నారు.పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంలో ఫీజు రియంబర్స్మెంట్ పథకం ఎంతో కీలకమైందన్నారు. ఇలాంటి పథకానికి రేవంత్ రెడ్డి సర్కారు తూట్లు పొడుస్తూ రద్దు చేసే దిశగా కుట్రలు పన్నుతుందన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.12 వేల కోట్లు బకాయిలు ఉన్నా..స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ అవినీతి విధానాల వల్ల రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం గందరగోళంగా మారిందన్నారు. బడుగు బలహీన వర్గాలను శాశ్వతంగా అణచివేసే కుట్ర ఫీజు రియంబర్స్మెంట్ను నిర్వీర్యం చేసి నోటికాడి ముద్దను లాక్కోవడమేనన్నారు. రాష్ట్రంలో మూడు ట్రిలియన్ అభివృద్ధి పనుల పేర్లు చెప్పే రేవంత్ రెడ్డి విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఎందుకు చెల్లించలేకపోతున్నారని ప్రశ్నించారు. విద్యార్థుల హక్కుల కోసం బిజెపి పోరాటం ఎన్నటికీ ఆగదని, మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే ఫీజు రియంబర్స్మెంట్ లో కూడా 40 శాతం కమిషన్లను కోరడమంటే ఇంతకన్నా పనికిమాలిన ప్రభుత్వం మరోకటి లేదన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు, విద్యార్థులకు అనేక హామీలిచ్చి తుంగలో తొక్కారని ఆరోపించారు. గత సంవత్సరం నవంబర్లో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు బందుకు పిలుపునిస్తే కేవలం కంటితుడుపుగా 200 కోట్లు విడుదల చేసిందన్నారు. ఒక్క ఇందూరు జిల్లాలోనే సుమారు 300 కోట్ల నుంచి 400 కోట్లు బకాయిలు ఉందని గుర్తు చేశారు. ఇందూరు జిల్లా నుంచి మొదలైన రణభేరి రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందని హెచ్చరించారు.

## కార్గిల్ లేక్ సుందరీకరణ పనులు గడువులోగా పూర్తి చేయాలి

-అమృత్ 2.0 కింద రూ. 1 కోటి 32 లక్షలతో పనులు

-కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



జులై 17 వార్త సాక్ష్యం

అమృత్ 2.0 కింద సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్ లేక్ బండ్ సుందరీకరణ పనులు గడువులోగా పూర్తి చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశించారు.అమృత్ 2.0 స్కీం కింద రూ.కోటి 32 లక్షలతో సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్ లేక్ చెరువు పునరుద్దరణ,సుందరీకరణ పనులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్,జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్,ఎస్పీ మహేష్ బిగితే తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు.లేక్ పరిసరాల ను అధికారులతో కలిసి పరిశీలించారు.కార్గిల్ యుద్దంలో వీర మరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కార్గిల్ లేక్ చెరువు పునరుద్దరణ, సుందరీకరణ పనులను కాంట్రాక్టర్ నిర్ణిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.లేక్ లోకి మురుగునీరు రాకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు.లేక్ సుందరీకరణతో సిరిసిల్ల పట్టణంతోపాటు జిల్లా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్‌బాబు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా,వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# బిజినెస్

## ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

ఫిఫా ప్రపంచ కప్ 2026 తుది అంకానికి చేరుకున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లోని ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రపంచ కప్ ఫైనల్ పోరుతో పాటు మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌ల దృష్ట్యా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బార్లు, క్లబ్బులు, మైక్రో బ్రూవరీలను నిర్ణీత సమయం కంటే అదనంగా తెరిచి ఉంచేందుకు అనుమతినిచ్చింది. రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, జూలై 18 రాత్రి మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్ సందర్భంగా తెల్లవారుజామున 4:30 గంటల వరకు మద్యం సరఫరాకు వెసులుబాటు కల్పించారు. అలాగే, జూలై 19న అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య రాత్రి జరగనున్న ఫైనల్ మ్యాచ్ కోసం తెల్లవారుజామున 3 గంటల వరకు బార్లను తెరిచి ఉంచేందుకు అనుమతించారు. ఫిఫా ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి లేదా ఆ తర్వాత ప్రారంభమవుతుండటంతో అభిమానులు తమ ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోంది. పబ్లిక్ ప్లేసుల్లో ఇతరులతో కలిసి బిగ్ స్క్రీన్లపై వీక్షించే అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో బార్ల పనివేళలను పొడిగించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ జూలై 14న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దీనిపై సానుకూలంగా స్పందించిన రెవెన్యూ శాఖ తాజాగా అనుమతులు మంజూరు చేయగా, ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఫుట్‌బాల్ ప్రేమికులు స్నేహితులతో కలిసి బిగ్ స్క్రీన్‌లపై మ్యాచ్‌లను తిలకిస్తూ ఆనందించే అవకాశం లభించింది. అయితే, పొడిగించిన పనివేళల్లో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, భద్రతా ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని అధికారులు స్పష్టం చేశారు.

# మార్కెట్‌లో భారీ జోష్.. సెన్సెక్స్ 964 పాయింట్ల జంప్!

**24,334 వద్ద ముగిసిన నిఫ్టీ**
**బ్యాంకింగ్, ఐటీ షేర్లలో కొనుగోళ్లు**
**ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లలో ఒత్తిడి**
**దేశీయ మార్కెట్ సెంటిమెంట్ నిలకడగా ఉందన్న నిపుణులు**




ప్రైవేట్ బ్యాంకింగ్, ఐటీ, ఆటో షేర్లలో భారీ కొనుగోళ్లు నమోదవడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. ఉదయం నుంచి కొనుగోళ్ల జోరు కొనసాగడంతో సూచీలు రోజంతా గ్రీన్‌లోనే ట్రేడ్ అయ్యాయి. చివరకు సెన్సెక్స్ 964.58 పాయింట్లు ఎగబాకి 78,151.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 261.55 పాయింట్లు పెరిగి 24,334.30 వద్ద స్థిరపడింది. మార్కెట్‌లో ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లు రాణించాయి. నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీ 2.12 శాతం లాభపడింది. ఐటీ సూచీ 1.75 శాతం ఎగబాకింది. రియాల్టీ సూచీ 1.34 శాతం, ఆటో సూచీ 1.24 శాతం చొప్పున పెరిగాయి. ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల షేర్లు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. నిఫ్టీ-50 సూచీలో టెక్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు అత్యధికంగా లాభపడ్డ వాటిలో ఉన్నాయి. హిందాల్కో, డాక్టర్ రెడ్డీస్, విప్రో, సన్ ఫార్మా, అపోలో హాస్పిటల్స్ షేర్లు నష్టపోయాయి. ఏఐ కంపెనీల అధిక విలువలు, పశ్చిమాసియా భౌగోళిక ఉద్రిక్తతలు, ప్రపంచ మార్కెట్లలో ఒడుదొడుకులు కొనసాగుతున్నా.. దేశీయ మార్కెట్ సెంటిమెంట్ నిలకడగా ఉందని నిపుణులు తెలిపారు. తొలి త్రైమాసిక ఫలితాలపై నెలకొన్న అంచనాలు, కంపెనీల వ్యాపార అప్‌డేట్లు కూడా కొనుగోళ్లకు ఊతమిచ్చాయని విశ్లేషించారు. సాంకేతికంగా చూస్తే నిఫ్టీకి 24,400 స్థాయి కీలక నిరోధంగా ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ స్థాయిని దాటితే సూచీ 24,500 నుంచి 24,600 స్థాయుల దిశగా కదిలే అవకాశం ఉందని అంచనా వేశారు. మరోవైపు 24,200 తక్షణ మద్దతుగా మారిందని, ఆ తర్వాత 24,000 స్థాయి కీలక సపోర్ట్‌గా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# వరల్డ్ కప్ ఫైనల్‌కు రెఫరీగా విన్సిచ్..

## అర్జెంటీనాకు పాత భయాలు.. మెస్సీ అభిమానుల్లో టెన్షన్!





2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. న్యూయార్క్ వేదికగా ఆదివారం అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య జరిగే ఈ టైటిల్ పోరుకు స్లోవేనియాకు చెందిన ప్రముఖ రెఫరీ స్లావ్కో విన్సిచ్‌ను ఫిఫా నియమించింది. ఈ వార్త ఫుట్‌బాల్ ప్రపంచంలో సంతోషం నింపినప్పటికీ, అర్జెంటీనా అభిమానుల్లో మాత్రం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. దీనికి కారణం విన్సిచ్ రెఫరీయింగ్‌లో అర్జెంటీనాకు ఉన్న ఒక చేదు గతం. ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌కు తనను ఎంపిక చేసినట్లు తెలియగానే, రెఫరీ కిట్ అందుకుంటూ విన్సిచ్ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతనికి సహాయకులుగా తోమాజ్ క్లాంక్నిక్, ఆంద్రాజ్ కోవాసిచ్ వ్యవహరించనున్నారు.

**అర్జెంటీనాకు ఎందుకు ఆందోళన?**

స్లావ్కో విన్సిచ్ పేరు వినగానే అర్జెంటీనా అభిమానులకు 2022 ఖతార్ ప్రపంచకప్‌లో జరిగిన ఒక ఘోర పరాభవం గుర్తుకొస్తుంది. ఆ టోర్నమెంట్‌లో అర్జెంటీనా ఆడిన తొలి మ్యాచ్ సౌదీ అరేబియాతో జరిగింది. నవంబర్ 22న లుసైల్ స్టేడియంలో జరిగిన ఆ మ్యాచ్‌కు విన్సిచ్ రెఫరీగా ఉన్నాడు. ఆట ప్రారంభమైన 8వ నిమిషంలోనే అర్జెంటీనాకు పెనాల్టీ ఇవ్వగా, మెస్సీ గోల్ చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ మొత్తం మీద సౌదీ ఆటగాళ్లకు ఆరు ఎల్లో కార్డులు కూడా చూపించాడు. కానీ, చివరికి ఫలితం తారుమారైంది. సెకండాఫ్‌లో సౌదీ అరేబియా సంచలన ప్రదర్శన చేసి 2-1 తేడాతో అర్జెంటీనాను ఓడించి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ప్రపంచకప్ చరిత్రలోనే అది ఒక పెద్ద షాక్. మెస్సీ జట్టు విన్సిచ్ రెఫరీయింగ్ లో ఓడిపోయిన ఏకైక మ్యాచ్ కూడా ఇదే కావడం గమనార్హం. ఈ పాత జ్ఞాపకాలే ఇప్పుడు అర్జెంటీనా అభిమానులను కలవరపెడుతున్నాయి.

> 2026 ప్రపంచకప్ ఫైనల్‌కు రెఫరీగా స్లోవేనియాకు చెందిన స్లావ్కో విన్సిచ్
> 2022లో విన్సిచ్ రెఫరీయింగ్‌లోనే సౌదీ చేతిలో అర్జెంటీనా ఓటమి
> తాజా నియామకంతో అర్జెంటీనా అభిమానుల్లో నెలకొన్న ఆందోళన
> స్పెయిన్ ఆడిన కీలక మ్యాచ్‌లలో విన్సిచ్ రెఫరీగా వ్యవహరించి సానుకూల ఫలితాలు
> ఫైనల్‌లో విన్సిచ్ ప్రతి నిర్ణయంపై తీవ్ర ఒత్తిడి ఉండే అవకాశం

**స్పెయిన్‌కు మాత్రం సానుకూల చరిత్ర**

అర్జెంటీనాకు విన్సిచ్‌తో చేదు అనుభవం ఉంటే, స్పెయిన్‌కు మాత్రం అతనితో సానుకూల రికార్డు ఉంది. యూరోపియన్ టోర్నీలలో స్పెయిన్ ఆడిన అనేక కీలక మ్యాచ్‌లకు విన్సిచ్ రెఫరీగా వ్యవహరించాడు. 2017లో కొలంబియాతో స్నేహపూర్వక మ్యాచ్, యూరో 2020లో స్వీడన్‌తో గ్రూప్ మ్యాచ్, 2023లో ఇటలీతో నేషన్స్ లీగ్ సెమీ-ఫైనల్ మ్యాచ్‌లకు అతడు బాధ్యతలు నిర్వర్తించాడు. ముఖ్యంగా యువ సంచలనం లామిన్ యమాల్ జట్టులోకి వచ్చాక, యూరో 2024లో ఇటలీ, ఫ్రాన్స్‌లపై స్పెయిన్ గెలిచిన కీలక మ్యాచ్‌లకు విన్సిచ్ రెఫరీగా ఉన్నాడు. ఈ రికార్డు స్పెయిన్ జట్టుకు కొంత ఊరటనిచ్చే అంశం.

**ఈ వరల్డ్‌కప్‌లోనూ వివాదం**

ప్రస్తుత ప్రపంచకప్‌లో కూడా విన్సిచ్ తన కఠిన నిర్ణయాలతో వార్తల్లో నిలిచాడు. మెక్సికో-ఈక్వెడార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈక్వెడార్ ఆటగాడు పీరో హిన్కాపీకి రెడ్ కార్డ్ చూపించాడు. ప్రత్యర్థి ఆటగాడితో మాట్లాడేటప్పుడు నోటికి చేయి అడ్డుపెట్టుకోవడం ఫిఫా నియమావళిని ఉల్లంఘించడమేనని భావించి ఈ నిర్ణయం తీసుకున్నాడు. దీన్ని బట్టి చూస్తే, అతడు నిబంధనల విషయంలో ఎంత కఠినంగా ఉంటాడో అర్థమవుతుంది. అర్జెంటీనా మ్యాచ్‌లలో రెఫరీ నిర్ణయాలు తరచూ వివాదాస్పదం అవుతున్న నేపథ్యంలో, ఈ ఫైనల్‌లో స్లావ్కో విన్సిచ్ ప్రతి నిర్ణయంపై ప్రపంచం దృష్టి నిలుస్తుంది. అతనిపై తీవ్ర ఒత్తిడి ఉండటం ఖాయం.

# క్రీడలు

## భారత్‌కు రోహిత్-కోహ్లీ.. ఇంగ్లాండ్‌కు జో రూట్: కుంబ్లే

**రూట్‌ను విరాట్, రోహిత్‌తో పోల్చిన కుంబ్లే**
**ఈ ముగ్గురూ ఒత్తిడిలో ఇన్నింగ్స్ నిర్మిస్తారని ప్రశంస**
**రూట్ వన్డే శైలిపై ప్రత్యేక వ్యాఖ్యలు**
**ముగ్గురూ బంతిని చూసి స్పందిస్తారని వివరణ**



తక్కువ రిస్క్‌తో ఎక్కువ పరుగులు ఇచ్చే షాట్లని ఎంచుకుంటారని ప్రశంస
టీమిండియాకు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఎంత కీలక ఆటగాళ్లో ఇంగ్లండ్‌కు జో రూట్ అంతే కీలకమని మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అన్నాడు. ఒత్తిడిలో ఇన్నింగ్స్‌ను నిలబెట్టే సామర్థ్యం ఈ ముగ్గురిలోనూ ఒకేలా ఉంటుందని చెప్పాడు. కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో రూట్ ఆడిన 99 పరుగుల ఇన్నింగ్స్‌పై స్పందిస్తూ కుంబ్లే ఈ వ్యాఖ్యలు చేశాడు. 234 పరుగుల లక్ష్య ఛేదనలో రూట్ 133 బంతుల్లో 99 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇన్నింగ్స్‌ను చివరి వరకు నడిపించి ఇంగ్లండ్‌కు నాలుగు వికెట్ల విజయాన్ని అందించాడు. అయితే గస్ అట్కిన్సన్ బౌండరీ కొట్టడంతో రూట్ ఒక్క పరుగు తేడాతో సెంచరీ మిస్ చేసుకున్నాడు.
రూట్ ఇప్పటికీ సంప్రదాయ వన్డే శైలిలోనే బ్యాటింగ్ చేస్తాడని కుంబ్లే పేర్కొన్నాడు. మిగతా ఇంగ్లండ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడగా, రూట్ మాత్రం ఓపికగా ఇన్నింగ్స్‌ను నిర్మించాడని చెప్పాడు. స్ట్రైక్‌ను మారుస్తూ, గ్యాప్‌లలోకి బంతిని పంపిస్తూ ఒత్తిడిని తగ్గించడంలో అతను సిద్ధహస్తుడని కొనియాడాడు. అవసరం లేని సమయంలో రిస్క్ షాట్లు ఆడకపోవడమే అతని బలం అని వివరించాడు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్‌తో పోలిస్తే రూట్ ప్రత్యేకత స్పష్టంగా కనిపించిందని కుంబ్లే అభిప్రాయపడ్డాడు. పరిస్థితులు సహకరించని పిచ్‌పై కూడా బ్రూక్ టీ20 తరహా షాట్లు ఆడేందుకు ప్రయత్నించాడని, రూట్ మాత్రం వన్డే బ్యాటింగ్‌కు ఆదర్శంగా నిలిచే ఇన్నింగ్స్ ఆడాడని పేర్కొన్నాడు. రూట్, విరాట్, రోహిత్ విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం కూడా ఇదేనని కుంబ్లే చెప్పాడు. ఈ ముగ్గురు ముందే షాట్ నిర్ణయించుకోరని, బంతిని చూసి స్పందిస్తారని వివరించాడు. తక్కువ రిస్క్‌తో ఎక్కువ పరుగులు ఇచ్చే షాట్లనే ఎంచుకుంటారని తెలిపాడు. అలాంటి ఆటతీరు జట్టుకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని కుంబ్లే అభిప్రాయపడ్డాడు.

# 'ఏక్ దిన్'( అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!

తెలుగు తమిళ మలయాళ భాషల్లో సాయి పల్లవికి ఎంతో క్రేజ్ ఉంది. సాయిపల్లవి ఒక కథకు ఓకే చెప్పిందంటే, ఆ కథలో ఏదో బలమైన పాయింట్ ఉండి ఉంటుందని అభిమానులు భావిస్తూ ఉంటారు. అలాంటి సాయిపల్లవి తొలిసారిగా ఒక హిందీ సినిమా చేసింది. ఆ సినిమా పేరే 'ఏక్ దిన్'. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా, మే 1వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ సినిమా ఓటీటీ హక్కులను 'అమెజాన్ ప్రైమ్' దక్కించుకుంది. ఈ రోజు (జులై 17) నుంచి ఈ సినిమా హిందీతో పాటు ఇతర భాషల్లో అందుబాటులోకి వచ్చింది. దినేష్ (జునైద్ ఖాన్) ఒక సాఫ్ట్ వేర్ సంస్థలో పనిచేస్తూ ఉంటాడు. అదే ఆఫీసులో మీరా రంగనాథ్ (సాయిపల్లవి) వర్క్ చేస్తూ ఉంటుంది. ఆమెను చూడగానే అతను మనసు పారేసుకుంటాడు. అయితే ఆమె ఆ సంస్థకి చెందిన 'నకుల్' (కునాల్ కపూర్)తో చనువుగా ఉండటం చూసి చాలా ఆవేదన చెందుతూ ఉంటాడు. నకుల్ తన భార్య 'రీతూ' (జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్)తో విడాకులు తీసుకోనున్నట్టు మీరాతో చెబుతాడు. మీరా పట్ల తనకి గల ప్రేమను వ్యక్తం చేస్తాడు. మీరాకి 'జపాన్'ను చూడాలనే కోరిక చిన్నప్పటి నుంచి బలంగా ఉంటుంది. ఆ విషయం నకుల్ కి తెలుసు. ఆ ఏడాది తాము టార్గెట్ రీచ్ అయ్యామంటూ, అతను ఎంప్లాయిస్ ను జపాన్ తీసుకుని వెళతాడు. అక్కడ నకుల్ తో మీరా మరింత సాన్నిహిత్యంగా ఉండటం చూసి, దినేష్ బాధపడతాడు. అయితే అనుకోకుండా అక్కడికి నకుల్ భార్య 'రీతూ' వస్తుంది. ఆమె గర్భవతి అని మీరాకి తెలుస్తుంది. రీతూకి విడాకులు ఇవ్వనున్నట్టు తనకి నకుల్ చెప్పింది అబద్ధమని గ్రహిస్తుంది. తనని నకుల్ మోసం చేయడాన్ని తట్టుకోలేని మీరా, విపరీతంగా తాగేసి ప్రమాదానికి గురవుతుంది. ఆమెను హాస్పిటల్లో చేరుస్తాడు దినేష్. ఆమె తన గతాన్ని మరిచిపోయిందనీ, 24 గంటల తరువాత గతం గుర్తుకు వస్తుందని డాక్టర్లు చెబుతారు. అయితే గతం గుర్తుకు వచ్చిన తరువాత, ఈ 24 గంటలలో ఏం జరిగిందనేది ఆమెకి ఎంతమాత్రం గుర్తుకురాదని అంటారు. అప్పుడు దినేష్ ఏం చేస్తాడు? ఒక్కరోజుపాటు తనతో మీరా ప్రేమగా ఉన్నా చాలనుకున్న అతని కోరిక నెరవేరుతుందా? ఆ రోజు తరువాత, దినేష్ తో గడిపిన క్షణాలు ఆమెకి గుర్తుంటాయా? అనేది మిగతా కథ. శ్రీమంతుడైన ఒక యువకుడు తన ఆఫీసులో పనిచేసే 'మీరా'పై కన్నేస్తాడు. తన భార్య మంచిది కాదంటూ, మీరాకి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తాడు. జపాన్ చూడాలనే ఆమెలోని కోరికను తనకు అనుకూలంగా మార్చుకుంటాడు. మిగతా ఎంప్లాయిస్ తో పాటు అక్కడికి తీసుకుని వెళతాడు. ఆమెను సొంతం చేసుకోవడానికి రంగాన్ని సిద్ధం చేస్తాడు. అతని నిజస్వరూపం తెలుసుకున్న మీరా ప్రమాదానికి గురవుతుంది. ఆమెను మౌనంగా ఆరాధిస్తూ అనుసరిస్తూ వస్తున్న దినేష్ ఏం చేస్తాడు? అనే అంశం చుట్టూ నడిచే కథ ఇది. ఈ కథ అంతా మీరా నకుల్ దినేష్ చుట్టూ తిరుగుతుంది. ప్రేమ పేరుతో ఆకర్షించే నకుల్, ప్రేమ అనుకుని ఆకర్షణ దిశగా పరిగెత్తే మీరా, ఆమె ప్రేమ కోసం ఎంతకాలమైనా ఎదురు చూడొచ్చునని భావించే దినేష్ పాత్రలు ఈ కథలో ప్రధానమైనవి. కథను మొదటి నుంచి చివరి వరకూ నడిపించేంత కీలకమైనవి. తెరపై ఎక్కువగా ఈ మూడు పాత్రలు మాత్రమే కనిపించినా, ఎక్కడా బోర్ అనిపించదు. ప్రతి సన్నివేశంలోని ఫీల్ కనెక్ట్ అవుతుంది. జీవితంలో ఎవరు ఎలాంటి వాళ్లు అనేది తెలియాలంటే అవసరమో .. ఆపదో రావాలంటారు. అప్పుడే మనతో నిలబడేదెవరో .. మనలను నిలబెట్టేదెవరో అర్థమైపోతుంది. సరిగ్గా ఆ పాయింట్ ను టచ్ చేస్తూనే దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు. నిజమైన ప్రేమను పంచే మనసును .. వాళ్ల పలకరింపును .. స్పర్శను మరిచిపోవడం అసాధ్యమనే విషయాన్ని దర్శకుడు ఆవిష్కరించిన విధానం గొప్పగా అనిపిస్తుంది. సాయిపల్లవి నటన ఈ సినిమాకి హైలైట్ అని చెప్పాలి. ఆడంబరాలు .. ఆకర్షణలు కాదు, ప్రేమించడానికి మంచి మనసు ఉండాలని నిరూపించే పాత్రలో జునైద్ కూడా నీట్ గా చేశాడు. అవసరం .. అవకాశం తప్ప మనిషికీ .. మనిషికి మధ్య మరేమీ ఉండదనే పాత్రలో కునాల్ నటన కూడా ఆకట్టుకుంటుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ .. లొకేషన్స్ ఈ కథను మరింత సపోర్టు చేస్తూ సాగుతాయి.జీవితంలో మనలను ప్రేమించే మనిషంటూ ఒకరి ఉంటే, ఆ ప్రయాణం ఎంతో అందంగా అనుభూతి మయంగా ఉంటుంది. అలాంటి ప్రేమను అర్థం చేసు కోలేకపోతే ఆ వెలితి వెంటాడుతూ ఉంటుంది. నిజమైన ప్రేమ నిస్వార్థమైన ప్రేమ ఓడిపోయిన దాఖలాలు దాదాపుగా లేవని నిరూపించే ఈ కథ, ఫ్యామిలీ ఆడియన్స్‌కి తప్పకుండా కనెక్ట్ అవుతుంది.




# జానీ మాస్టర్‌కు ఫెడరేషన్ షాక్.. షోకాజ్ నోటీసు, బహిష్కరణ

**ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు ఫెడరేషన్ షోకాజ్ నోటీసు**

**ఫెడరేషన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆరోపణ**

**జానీ మాస్టర్‌తో ఏ సినిమాకూ సహకరించబోమని ప్రకటన**

**ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశం**

ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై తెలుగు చలనచిత్ర కార్మిక సమాఖ్య (ఫెడరేషన్) కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఫెడరేషన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయనపై దేశవ్యాప్త బహిష్కరణ విధిస్తున్నట్లు సంచలన ప్రకటన చేసింది. జూలై 12న జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలు, ఆయన ప్రవర్తన సమాఖ్య ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని ఫెడరేషన్ పేర్కొంది. ఈ అంశంపై వివరణ ఇచ్చేందుకు జూలై 14న విచారణకు హాజరుకావాలని ఆదేశించినప్పటికీ ఆయన గైర్హాజరైనట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో, ఏడు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణతో పాటు బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో స్పష్టం చేసింది. ఆదేశాలను బేఖాతరు చేస్తే మరిన్ని కఠిన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించింది. సమాఖ్య తీసుకున్న ఈ నిర్ణయం వల్ల జానీ మాస్టర్ పనిచేసే ఏ చిత్రానికైనా, ఏ భాష చిత్ర పరిశ్రమలోనైనా కార్మికులు సహకరించబోరని ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఈ పరిణామం ఆయన వృత్తిగత కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. మరోవైపు, డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలి హోదాలో ఉన్న జానీ మాస్టర్ భార్య సుమలత వ్యవహారశైలిపై కూడా ఫెడరేషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇటీవల తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో జానీ మాస్టర్, శేఖర్ మాస్టర్ వర్గాల మధ్య చోటు చేసుకున్న వాగ్వాదానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఫెడరేషన్ అనుమతి లేకుండా సుమలత ఉప ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం వంటి చర్యలే ఈ వివాదానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. అయితే, మెగాస్టార్ చిరంజీవి జోక్యంతో తమ మధ్య విభేదాలు తొలగిపోయాయని, 'విశ్వంభర' చిత్ర సెట్స్‌లో అంతా సర్దుకుందని జానీ మాస్టర్ వివరణ ఇచ్చారు. అయినప్పటికీ, ఫెడరేషన్ తాజా చర్యలతో ఈ వివాదం మరోసారి తీవ్రరూపం దాల్చింది.



# తెలుగు ఇండస్ట్రీని ఆకాశానికెత్తిన రకుల్ ప్రీత్.. బాలీవుడ్‌పై తీవ్ర విమర్శలు

**టాలీవుడ్, బాలీవుడ్ పనివిధానంపై రకుల్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**బాలీవుడ్ కంటే తెలుగు ఇండస్ట్రీలోనే ఐక్యత ఎక్కువన్న నటి**

**టాలీవుడ్‌లో ఒకరినొకరు ప్రోత్సహించుకుంటారని ప్రశంస**

**బాలీవుడ్‌లో అసూయ, నెగెటివ్ పీఆర్ సర్వసాధారణమని వ్యాఖ్య**

టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పనితీరుపై కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని సహకార స్ఫూర్తిని కొనియాడిన ఆమె, బాలీవుడ్‌లో మాత్రం అభద్రతాభావం, అసూయ వంటి ధోరణులు ఎక్కువగా కనిపిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్, తన సినీ ప్రయాణం మొదలైన తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రశంసలు కురిపించారు. "టాలీవుడ్‌లో ఒకరి సినిమాలను మరొకరు బహిరంగంగా ప్రోత్సహిస్తారు. తోటి నటీనటుల చిత్రాల ట్రైలర్లను విడుదల చేయడం, వేడుకలకు హాజరవ్వడం వంటివి ఇక్కడ సాధారణం. వృత్తిపరమైన పోటీ ఉన్నప్పటికీ, ఒకరి విజయాన్ని మరొకరు మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తారు "అని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో బాలీవుడ్ పరిస్థితి భిన్నంగా ఉంటుందని, అక్కడ అసూయ, అభద్రతాభావం కారణంగా పరస్పర సహకారం చాలా తక్కువని ఆమె అన్నారు. కొందరు కావాలనే ఇతరులపై ప్రతికూల ప్రచారాలు (నెగెటివ్ పీఆర్ క్యాంపెయిన్లు) నిర్వహిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "తెలుగు పరిశ్రమలో ఐక్యత, సహృద్భావం మెండుగా ఉంటాయి. ఈ లక్షణాలను హిందీ పరిశ్రమ కూడా అలవర్చుకుంటే అది మరింత బలోపేతం అవుతుంది" అని రకుల్ సూచించారు. గతంలోనూ అల్లు అర్జున్, మహేశ్ బాబు వంటి అగ్ర హీరోల వినయాన్ని, వృత్తి పట్ల వారికున్న నిబద్ధతను ఆమె కొనియాడారు. దక్షిణాదిలో గడించిన అనుభవాలే తన కెరీర్‌ను తీర్చిదిద్దాయని, ఇక్కడి ప్రేక్షకుల ఆదరణ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఆమె కృతజ్ఞత చాటుకున్నారు. రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తన ఎదుగుదలకు తోడ్పడిన పరిశ్రమ పట్ల ఆమె చూపిన గౌరవానికి నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.